తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం-27-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 298 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# పేదల వైద్యం కోసం భారీ నిధులు

# 4,500 కోట్లు ఖర్చు

### విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత: సీఎం రేవంత్

### ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా విస్తృత సహాయం

### 1.15 కోటి కుటుంబాలకు జీవిత బీమా పథకం



**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైతే మరిన్ని నిధులు సమకూర్చుతామని స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సీఎం జోక్యం చేసుకుని పలు అంశాలను వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా అత్యధికంగా ఖర్చు చేసినట్టు తెలిపారు. గత 27 నెలల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన సహాయంపై గణాంకాలను వెల్లడించారు.

మిగతా 2లో..

## భూపరిపాలనలో కొత్త దశ: భూభారతి పోర్టల్ ప్రారంభం

- ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో పైలట్ అమలు
- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు ఒకే వేదిక
- ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్



**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో భూపరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చేందుకు 'ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్'ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న ఈ పోర్టల్ ద్వారా సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్ని సేవలను ఒకే వేదికలో అందించనున్నారు.

మిగతా 2లో..

## ఎంఎంటీఎస్ సేవల మెరుగుదలకు సీఎం ఆదేశాలు

కార్యాలయ సమయాల్లో సర్వీసుల పెంపు – సమయపాలనపై దృష్టి

లాస్ట్ మైల్ కనెక్టివిటీ మెరుగుపరచాలని సూచనలు

ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనపై దృష్టి

2లో

## సీఎస్ఆర్ నిధులపై ప్రత్యేక పాలసీకి సీఎం ఆదేశాలు

నిధుల సమీకరణ, వినియోగంపై సమగ్ర ప్రణాళిక

రాష్ట్ర స్థాయి సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు నిర్ణయం

కార్పొరేట్ భాగస్వామ్యాన్ని పెంపు లక్ష్యంగా చర్యలు

2లో



## అర్బన్ పీహెచ్‌సీకి నూతన వైద్య పరికరాల పంపిణీ

బంజారాహిల్స్‌లో ఆరోగ్య సేవలకు బలం

స్థానికులకు నాణ్యమైన వైద్యం అందించే లక్ష్యం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్ వెంకటేశ్వరనగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన వైద్య పరికరాలను పంపిణీ చేశారు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి. ఈ పరికరాల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

మిగతా 2లో..

## విమల ఆరోగ్యంపై ఉప ముఖ్యమంత్రి ఆరా

- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గద్దర్ సతీమణి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పరామర్శ
- మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు



2లో



## నల్గొండ అభివృద్ధే లక్ష్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- రూ.6 కోట్లతో జూనియర్ కళాశాల భవనానికి భూమిపూజ
- విద్య, ఉపాధి రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు

2లో



## మధ్య భారత్‌కు ఎల్పీజీ నౌక చేరిక

మంగళూరు పోర్టుకు "అపోలో ఓషియన్" రాక

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మధ్య సరఫరా కొనసాగింపు

గ్యాస్ కొరతకు కొంత ఉపశమనం

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పేదల వైద్యం కోసం భారీ నిధులు
# 4,500 కోట్లు ఖర్చు

(మొదటి పేజీ తరువాయి)

పేదల వైద్యానికి తమ ప్రభుత్వం రూ. 4,500 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2,046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. గతంతో పోలిస్తే నెలవారీ ఖర్చు గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. పేదల్లో ధైర్యం కల్పించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వే ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచినట్టు సీఎం తెలిపారు. గత ప్రభుత్వ బకాయిలను భరిస్తూనే తమ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో సంస్కరణలు చేపట్టిందని చెప్పారు. ఆసుపత్రులకు వేల కోట్లు చెల్లించి వ్యవస్థను బలోపేతం చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో నిమ్స్, టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు కొత్తగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. మొత్తం 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సీఎం స్పష్టం చేశారు.

# ఎంఎంటీఎస్ సేవల మెరుగుదలకు సీఎం ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యాలయ సమయాల్లో ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచడంతో పాటు క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ సేవలను నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.
శాసనసభ మండలి హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఎంఎంటీఎస్ సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పట్టడానికి గల కారణాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవడం, స్టేషన్లు లోపల ఉండటం వల్ల రాకపోకల్లో ఇబ్బందులు ఉన్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో స్టేషన్లకు చేరుకునేందుకు మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. శుభ్రత, భద్రత, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు ఆకర్షితులవుతారని పేర్కొన్నారు.
స్వీయ ఆదాయ వనరులను పెంచుకునేందుకు కూడా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రకటనలు, వాణిజ్య కార్యకలాపాల ద్వారా ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థను ఆర్థికంగా బలపరచడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా హాజరై ఎంఎంటీఎస్ సేవల అభివృద్ధిపై చర్చించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ, ప్రయాణికుల సంఖ్య పెంపు కోసం సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# సీఎస్ఆర్ నిధులపై ప్రత్యేక పాలసీకి సీఎం ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**



కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల సమీకరణతో పాటు సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతున్న కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరపున అభినందించాలని సూచించారు.
ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం అందించిన సంస్థల ప్రతినిధులను సత్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.
సీఎస్ఆర్ కార్యకలాపాల సమన్వయానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శాసనమండలి సమావేశ హాలులో సీఎస్ఆర్ నిధులపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలు, ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను సమన్వయం చేయాలని తెలిపారు. ఈ బాధ్యతలను రాష్ట్రస్థాయి సీఎస్ఆర్ సెల్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు.
కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వంతో సులభంగా అనుసంధానం అయ్యేలా ప్రత్యేకంగా తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. విరాళాలు ఇవ్వాలనుకునే సంస్థలకు, ప్రాజెక్టులను ఎంచుకునే సౌకర్యం కల్పించాలన్నారు. పోర్టల్‌ను ఆకర్షణీయంగా, వినియోగదారులకు సౌకర్యవంతంగా తయారు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా సీఎస్ఆర్ నిధులలో తెలంగాణ వాటా కేవలం 3 శాతం మాత్రమే ఉందని అధికారులు నివేదించగా, ఈ స్థితిపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కంపెనీలు పనిచేస్తూ నిధులను ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణలోనే ఎక్కువగా సీఎస్ఆర్ నిధులు ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న సీఎస్ఆర్ విధానాలను అధ్యయనం చేసి, మన రాష్ట్రానికి అనుకూలంగా కొత్త పాలసీ రూపొందించాలని సీఎం సూచించారు. కార్పొరేట్ సంస్థలను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకుని నిధుల సమీకరణను పెంచాలని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విమల ఆరోగ్యంపై ఉప ముఖ్యమంత్రి ఆరా

**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆరా తీశారు. గాల్ బ్లాడర్ సమస్యతో ఆమె నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్తో కలిసి ఆసుపత్రికి వెళ్లి విమలతో మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకుని వైద్యులతో చర్చించారు. ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలపై వివరాలు సేకరించారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో మాట్లాడి చికిత్స విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విమల ఆరోగ్య స్థితి, చికిత్స పురోగతిపై సమగ్ర సమాచారం పొందారు. వైద్యులు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. విమల గారికి ప్రభుత్వం తరపున అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. చికిత్సలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విమల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. వైద్యుల సూచనల ప్రకారం పూర్తి విశ్రాంతి అవసరమని తెలిపారు. ప్రస్తుతం విమల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. త్వరలోనే ఆమె పూర్తిగా కోలుకుని సాధారణ జీవనానికి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం నిరంతరం అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# హార్మూజ్ సంక్షోభం మధ్య భారత్‌కు ఎల్పీజీ నౌక చేరిక




**మంగళూరు, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియా దేశాల్లో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య భారత్‌కు మరో ఎల్పీజీ నౌక చేరుకుంది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించి "అపోలో ఓషియన్" నౌక కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరింది. ఈ నౌకలో సుమారు 16,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ ఉండగా, ప్రస్తుతం అన్‌లోడింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరస్పర దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ దాడుల్లో ఇరాన్ నేవీ కమాండర్ అలీ రెజా మరణించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగించడంతో అంతర్జాతీయ చమురు రవాణాపై ప్రభావం పడింది.
ఇజ్రాయెల్, అమెరికా దేశాలకు చెందిన నౌకలు జలసంధి దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. అయితే భారత్ సహా కొన్ని మిత్రదేశాలకు చెందిన నౌకలకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో భారత్‌కు అవసరమైన చమురు, ఎల్పీజీ సరఫరా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో "అపోలో ఓషియన్" నౌక సురక్షితంగా భారత్ చేరుకోవడం కొంత ఉపశమనంగా మారింది. దేశంలో గ్యాస్ సరఫరాపై ఉన్న ఆందోళనలను ఇది తగ్గించనుంది. వరుసగా ఇలాంటి నౌకలు చేరడం వల్ల ఇంధన అవసరాలు తీర్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మంగళూరు పోర్టులో గ్యాస్ అన్‌లోడింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సరఫరా దేశవ్యాప్తంగా పంపిణీకి ఉపయోగపడనుంది. అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య కూడా సరఫరా నిలకడగా కొనసాగడం ముఖ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక పశ్చిమాసియాలో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతున్నాయి. యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడే అవకాశమున్న నేపథ్యంలో దేశాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. భారత్ కూడా ఇంధన భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నది.

# భూపరిపాలనలో కొత్త దశ: భూభారతి పోర్టల్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చామని తెలిపారు. గతంలో ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు మరింత సులభమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కొత్త వ్యవస్థను రూపొందించామని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో ఈ పోర్టల్‌ను మొదటి దశలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్‌లో వచ్చిన అనుభవాల ఆధారంగా మార్పులు చేసి రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేకంగా 'భూధార్ నంబర్' కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నంబర్లను కేటాయించినట్లు చెప్పారు. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంలో ఈ వ్యవస్థ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ఒకే క్లిక్‌తో భూమికి సంబంధించిన పూర్తి సమాచారం పొందే విధంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు మంత్రి వివరించారు. ఆర్వోఆర్, మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ వివరాలు, మార్కెట్ విలువ, గ్రామ మ్యాపులు, సర్వే వివరాలు, పాస్‌బుక్ సవరణలు వంటి అన్ని సేవలు ఒకే వేదికలో లభ్యమవుతాయని తెలిపారు. దరఖాస్తు నుంచి పూర్తి అయ్యే వరకు ప్రతి దశలో ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని అందించే సౌకర్యం కూడా కల్పించినట్లు చెప్పారు. భూపరిపాలనలో పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా భూసేవలను అందించడంలో ఈ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు పాల్గొని అమలు విధానంపై చర్చించారు.

# నల్గొండ అభివృద్ధే లక్ష్యం

**నల్గొండ, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్గొండను విద్యా, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యాభివృద్ధి ద్వారానే పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్" పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు వెల్లడించారు. తన సొంత నిధులతో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా పలు పాఠశాలలు, కాలేజీలు నిర్మించానని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తన ప్రధాన ధ్యేయమని తెలిపారు. విద్య ద్వారా యువతకు మంచి భవిష్యత్తు కల్పించవచ్చని అన్నారు.
నల్గొండ జిల్లాలో మెడికల్ కాలేజీ, ఏటీసీ కేంద్రం, న్యాక్ భవనాల నిర్మాణం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టులు జిల్లాలో అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల విస్తరణకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేశామని, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.
నల్గొండ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా పనిచేస్తానని మంత్రి తెలిపారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా అండగా నిలవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.

# అర్బన్ పీహెచ్‌సీకి నూతన వైద్య పరికరాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్బన్ పీహెచ్‌సీలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్యం అందించడం లక్ష్యమని పేర్కొన్నారు. కొత్తగా అందించిన వైద్య పరికరాలు చికిత్సా సేవలను మరింత సమర్థవంతంగా మార్చుతాయని తెలిపారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పనితీరును మంత్రి సమీక్షించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో సేవలు అందేలా చూడాలని సూచించారు. ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పరికరాల ద్వారా స్థానికులకు త్వరితగతిన పరీక్షలు, చికిత్సలు అందించే అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి ద్వారా ప్రజల ఆరోగ్య స్థితి మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ చర్యలు నగర ప్రాంతాల్లో వైద్య సేవల ప్రమాణాలను పెంచడంలో కీలకంగా మారనున్నాయని అధికారులు వెల్లడించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా--- సిబ్బంది లేరు.!

- సత్తుపల్లి సీహెచ్‌సీలలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, డాక్టర్ల కొరత.
- ఆస్పత్రుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన.
- ఎమ్మెల్యే మట్టా రాగమయి.

**సత్తుపల్లి, మార్చి 26(తెలంగాణ ముచ్చట్లు):**



అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్-2026 బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని ఆస్పత్రుల సమస్యలను ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ--- బిల్లును ప్రవేశపెట్టినందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లుతో వైద్య విధాన పరిషత్ మరియు డైరెక్టరేట్ మధ్య సమన్వయం పెరిగి, రోగులకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉందన్నారు. అయితే, తమ నియోజకవర్గంలోని మూడు సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. కొత్తగా నిర్మించిన 100 పడకల, 50 పడకల, 30 పడకల ఆస్పత్రి భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, తగిన మౌలిక వసతులు, నిపుణులైన వైద్యులు అందుబాటులో లేరని పేర్కొన్నారు. దీంతో ఆస్పత్రులను ప్రారంభించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కల్లూరు సీహెచ్‌సీలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ప్రస్తుతం ఉన్న వైద్యులు కాంట్రాక్ట్ లేదా డెప్యుటేషన్‌పై పని చేస్తున్నారని చెప్పారు. త్వరితగతిన క్యాడర్ స్ట్రెంత్ పెంచి, అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరారు. అలాగే 100 పడకల ఆస్పత్రికి సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక పరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ, గిరిజన ప్రాంతం కావడంతో ఇక్కడ పనిచేసే వైద్యులు ఇతర ప్రాంతాలకు డెప్యుటేషన్‌పై వెళ్లిపోతున్నారని, ఇలాంటి ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.




# డంప్‌యార్డ్ ప్రాంత పిల్లలకు ఇబ్బందుల్లో విద్య

- పేద కుటుంబాల పిల్లలకు కీలకమైన పాఠశాల సదుపాయాల లోపంతో వెనుకబడుతోంది

**జవహర్‌నగర్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని గాబిలంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డంప్‌యార్డ్ పరిసర ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాల పిల్లలకు విద్య అందిస్తున్న ఈ పాఠశాల ప్రస్తుతం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామే కిరణ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తిక్, కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పాఠశాల వాస్తవ పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో సుమారు 120 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ, కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటం తీవ్రమైన సమస్యగా మారింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు సరైన బోధన అందించలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ఒకే హాల్‌తో పాటు రెండు చిన్న గదుల్లో గుంపులుగా కూర్చొని చదువుకోవాల్సి రావడం విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తోంది. ఇంకా పాఠశాలకు శాశ్వత భవనం లేకపోవడం విద్యార్థులకు మరింత ఇబ్బందులను కలిగిస్తోంది. ఎండాకాలం, వర్షాకాలంలో సురక్షితమైన వాతావరణంలో చదువుకునే అవకాశం లేకపోవడం వల్ల వారి చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అదే విధంగా, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫార్ములు మరియు ఇతర విద్యా సామగ్రి కూడా ప్రభుత్వంవల్ల సమయానికి అందడం లేదని తెలిసింది. ఈ సంవత్సరం కూడా ఇతర పాఠశాలల నుండి వాటిని సేకరించాల్సి వచ్చిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అదనపు ఉపాధ్యాయులను నియమించాలని, పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని, విద్యా సామగ్రిని సమయానికి అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దమ్మపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

- గొంది మురళి మోహన్ ఘన విజయం

**దమ్మపేట, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గొంది మురళి మోహన్ ఘన విజయం సాధించారు. న్యాయవాదుల మెజారిటీ మద్దతుతో ఆయన ఈ పదవిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, స్థానిక ప్రముఖులు మురళి మోహన్‌ను అభినందించారు. ఆయన నాయకత్వంలో బార్ అసోసియేషన్ మరింత బలోపేతం కావడంతో పాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ న్యాయవాదులకు ప్రోత్సాహం, వృత్తి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బార్ అసోసియేషన్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తానని మురళి మోహన్ తెలిపారు.

# నాచారంలో చలివేంద్రం ప్రారంభం

- ప్రజల దాహార్తి తీర్చే సేవకు ప్రశంసలు

**నాచారం, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**






వేసవి వేడిమి తీవ్రత పెరుగుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాచారం ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. నాచారం హెచ్ఎంటి ప్రాంతంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వాసునూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి కొరత ఎక్కువగా ఉంటుందని, అలాంటి సమయంలో ప్రజల కోసం ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్, జి. కృష్ణ రెడ్డి, కాప్రా సాయి, మహేష్ యాదవ్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, రమేష్, అశ్వత్థామ రెడ్డి, భువన గౌడ్, సునీల్ రెడ్డి, యూసుఫ్, కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, సుధాకర్ రెడ్డి, షరీఫుద్దీన్, ఫిరోజ్, రేవంత్, షాహిద్, పాషా, నరేష్, చి. నరేష్, రఘు, కృపాకర్, రాజేష్, శశి, బాల్‌రాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఉమ, సునీత, సుష్మిత, మమత, విజయమ్మ, యాస్మీన్ తదితరులు పాల్గొన్నారు.

# నాచారంలో సమస్యలపై జలమండలి ఈడీని కలిసిన మాజీ కార్పొరేటర్

**నాచారం, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం.నాచారం డివిజన్‌లో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ మరియు మంచినీటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జలమండలి ఈడీ పంకజను కోరారు. ఈ మేరకు సైనిక్పురిలోని కార్యాలయంలో ఆమెను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా, కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేయించిన పలు అభివృద్ధి పనులు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత కౌన్సిల్‌లో కార్పొరేటర్లకు కేటాయించిన కోటి రూపాయల బడ్జెట్‌లో నుంచి 20 లక్షల రూపాయల నిధులను జలమండలికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు మంజూరు కాలేదని తెలిపారు. శ్రీ రాఘవేంద్ర నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ భూమిలో సుమారు 8 అడుగుల లోతులో ఉండటంతో రహదారి పనులు చేపట్టలేకపోతున్నామని పేర్కొన్నారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మంజూరైన పనులను తక్షణమే ప్రారంభించడంతో పాటు, కార్పొరేటర్ బడ్జెట్‌లోని 20 లక్షల రూపాయల నిధులను కూడా విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జలమండలి ఈడీ పంకజ సమస్యలను పరిశీలించి త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

# మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో ట్రాఫిక్ భద్రతపై స్థానికుల ఆందోళన

**కాప్రా, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఎన్ఎఫ్‌సీ రోడ్‌లోని గణేష్ టీ పాయింట్ వద్ద ఉన్న యూటర్న్‌ను మూసివేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఈ మేరకు స్థానికుల వినతి మేరకు మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి కుషాయిగూడ సీఐ రాజు మరియు పోలీసు సిబ్బందితో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ——ఎన్ఎఫ్‌సీ రోడ్ గణేష్ టీ పాయింట్ వద్ద ఉన్న యూటర్న్ తరచూ ప్రమాదాలకు కారణమవుతోందని, దానిని వెంటనే మూసివేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే తిరుమల నగర్ కమాన్, వెంకటేశ్వర నగర్ చౌరస్తా, ఇంద్రనగర్ ఫేజ్ 2 కమాన్, వసుంధర కాలేజ్ సమీప ప్రాంతాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉందన్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం అత్యవసరమని, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై లింగారెడ్డి, మల్లేష్ గౌడ్, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.






# కొబ్బరి రైతులకు సబ్సిడీ ఎరువుల పంపిణీ

- హెక్టారుకు రూ.42 వేల సహాయం
- సద్వినియోగం చేసుకోవాలని సూచన

**దమ్మపేట, మార్చి 26(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో మంజూరైన ఎరువులను కొబ్బరి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొబ్బరి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ, కొబ్బరి సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.42 వేల విలువైన ఎరువులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ సబ్సిడీ పథకాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగా కొబ్బరి తోటలు ఏర్పాటు చేసే రైతులకు ఒక్కో మొక్కకు రూ.350 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దమ్మపేట, అశ్వరావుపేట మండలాల్లో సుమారు 1,500 హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతోందని, ఈ ప్రాంత రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, రావి రఘు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ సత్యం, గణపా రాము, కర్లపూడి బాలు తదితరులు, స్థానిక కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లు మార్చి 28న 'చలో హైదరాబాద్' కి పిలుపు

**కుషాయిగూడ, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28,000 మంది ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్ణయించుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎం.రేవతి కళ్యాణి, తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు ఇప్పటికీ చట్టబద్ధ సౌకర్యాలు లేనందున అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎక్కువ మంది మహిళలు, బడుగు మరియు బలహీన వర్గాలకు చెందిన వారే అని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఆశా వర్కర్ల వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా హామీలు అమలు కాలేదని యూనియన్ విమర్శించింది. 50 లక్షల ఇన్సూరెన్స్, 50వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇంకా అమలులో లేవని పేర్కొన్నారు. అదేవిధంగా, పి.ఆర్.సి ఎరియర్స్, లెప్రసీ, పాల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీకి సంబంధించిన బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి నెల పారితోషికాలు కూడా సమయానికి చెల్లించకపోవడం వల్ల ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.ఉన్నికృష్ణన్ అన్నారు, "ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, ప్రమాద బీమా వంటి హక్కులు ఇప్పటివరకు ఇవ్వలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా మేనిఫెస్టో ప్రకారం వేతనాన్ని అమలు చేయాలి. లేకుంటే ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెకు దిగే పరిస్థితి వస్తుంది" అని హెచ్చరించారు. ఆశా వర్కర్లు కోరిన విధంగా మార్చి 28న జరగనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ పిలుపునిచ్చింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# శ్రీరామనవమి పండుగకు మద్యం దుకాణాల బంద్

**హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీరామనవమి పండుగను సౌభ్రాత్యంగా, శాంతియుతంగా జరుపుకోవడానికి నగర పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో, పండుగ రోజున మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలన్న నిర్ణయం తీసుకున్నారు.

**తేదీ, సమయం:**మార్చి 27, శుక్రవారం ,ఉదయం 10:00 నుండి రాత్రి 10:00 వరకు

**బంద్‌లోకి వస్తున్నవి:** అన్ని వైన్ షాపులు,కల్లు దుకాణాలు,రెస్టారెంట్లలోని బార్లు,మిలిటరీ క్యాంటీన్లు

**మినహాయింపు:** స్టార్ హోటళ్లు మరియు రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లు మాత్రమే బంద్ నుంచి మినహాయింపు పొందతాయి.

**కమిషనర్ హెచ్చరిక:**.నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిగితే, కఠిన చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటాం అని కమిషనర్ హెచ్చరించారు.పోలీసులు నగరంలో శాంతిభద్రతను సక్రమంగా ఉంచేందుకు పారిశుధ్య, రౌడీషీటు, మరియు మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పండుగ సందర్భంగా ప్రజలు శాంతియుతంగా, సాంప్రదాయాలను గౌరవిస్తూ జరుపుకోవాలని అధికారులు కోరారు.

# కుల నిర్మూలనపై స్టడీ సర్కిల్ నిర్వహణ

- సమాన సమాజ నిర్మాణానికి పిలుపు
- స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచనపై చర్చలు
- కుల వ్యవస్థ నిర్మూలనతోనే సమానత్వం సాధ్యమని వక్తల అభిప్రాయం



**ఏ ఎస్ రావు నగర్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ సామాజిక చింతకుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన "కుల నిర్మూలన" (కుల నిర్మూలన) గ్రంథంపై స్టడీ సర్కిల్ కార్యక్రమం నిర్వహించారు.ఈ గ్రంథాన్ని డి.హనుమంతరావు తెలుగులోకి అనువదించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు సమన్వయకర్తగా వ్యవహరించగా, సీనియర్ నాయకులు జంపాల శ్రీమన్నారాయణ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. అంబేద్కర్ రచనలోని సామాజిక, చారిత్రక అంశాలను ఆయన సవివరంగా వివరించారు.హిందూ సమాజంలో కుల వ్యవస్థ నిచ్చెన మెట్ల సంస్కృతిగా మారి ప్రజలను విభజించిందని, ఇది బ్రాహ్మణీయ భావజాల ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు రూపుదిద్దుకున్నదని పేర్కొన్నారు. ఇతర మతాల్లో పని విభజన ఉన్నప్పటికీ కుల ఆధారంగా మనుషులను విభజించరని, అందరికీ సమాన గౌరవం కల్పిస్తారని చెప్పారు. కానీ హిందూ సమాజంలో కుల వివక్ష తీవ్రంగా ఉండి, శూద్రులను బానిసలుగా చూసే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.సమాజంలో నిజమైన సమానత్వం రావాలంటే కుల వ్యవస్థ పూర్తిగా నిర్మూలించబడాలని, కుల దురహంకారాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సభ్యులు ఎం. భాస్కరరావు, వి.బి. బంగారు ఆచార్యులు, గిరీష్, రుక్కయ్య తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.అలాగే ఏప్రిల్ 11 నుంచి 14 వరకు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం,సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "కుల నిర్మూలన" అంశంపై వివిధ సాంస్కృతిక, విజ్ఞానదాయక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.చివరగా "దేశానికి కులం అరిష్టం - కులరహిత సమాజం కావాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వి.బి. బంగారు ఆచార్యులు, శారద, వెంకటేష్, రుక్కయ్య, నారాయణ, శివరామకృష్ణ, గిరీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల రామచంద్రయ్యకు నివాళి

- కుటుంబానికి చేయూత



**పెద్దమందడి,మార్చి26 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన శ్రీ కోట్ల రామచంద్రయ్య గురువారం మృతి చెందారు. వారి మరణం కుటుంబ సభ్యులకు, బంధువులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మృతుని పార్థివ దేహానికి జంగం శివ నివాళులర్పించి, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ దుఃఖ సమయంలో బాధిత కుటుంబానికి తోడుగా జంగం శివ రూ.2,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జంగం రమేష్, జంగం బాలరాజు, చాకలి లక్ష్మినారాయణ పాల్గొని, తమ మానవతా స్ఫూర్తిని చాటుకున్నారు.పెద్దమందడి గ్రామస్థులు మృతుని పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

# గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం విస్తరణకు చర్యలు

- వనపర్తికి 20 కొత్త బస్సులు కోరిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి,మార్చి26(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాలను అనుసంధానం చేస్తూ ప్రతి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్లడించారు.గురువారం అసెంబ్లీ హాల్ 1లో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు వనపర్తి ఆర్టీసీ డిపోకు కొత్తగా 20 బస్సులను మంజూరు చేయాలని మంత్రిని కోరారు.వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో బస్టాండ్ వైపు రోడ్డును విస్తరించేందుకు, డిపో గోడలకు ఆనుకుని ఉన్న చిరు వ్యాపార సముదాయాలను వెనక్కి మార్చి పునర్నిర్మించాలని, ఈ విషయంలో ఆర్టీసీ యాజమాన్యం సహకరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా, వనపర్తి జిల్లా కేంద్రంలో 20 ఎకరాల్లో నూతన బస్ డిపో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం ఉన్న పాత డిపో స్థలాన్ని పట్టణ అభివృద్ధి దృష్ట్యా వినియోగించనున్నట్లు వెల్లడించారు.పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వనపర్తిలో రెండు మినీ సిటీ బస్సులను ప్రవేశపెట్టాలని కోరారు. ఇది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అదనంగా, పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వరకు యాపర్ల, గుమ్మడం, చిన్న గుమ్మడం తండాల మీదుగా ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. వనపర్తి నుంచి మానాజిపేట్ మార్గంగా మహబూబ్‌నగర్‌కు అదనంగా నాలుగు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని, అలాగే వనపర్తి-పెద్దమందడి మార్గంలో రోజుకు పది ట్రిప్పులతో షటిల్ బస్సు నడపాలని కోరారు. జిల్లాలోని రోడ్డు రవాణా కార్యాలయం కోసం అప్పయ్యపల్లి సమీపంలో కేటాయించిన స్థలంలో నూతన భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇంకా, వనపర్తి మరియు పెబ్బేరు బస్టాండ్లలో సీసీ బెడ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. వనపర్తి బస్టాండ్ అభివృద్ధికి రూ.2.50 కోట్లు, పెబ్బేరు బస్టాండ్‌కు రూ.1.20 కోట్లు మంజూరై ఉన్నాయని, వీటి పనులు తక్షణమే ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కటికాల వెంకటేశ్వరరావు ఘన విజయం

- సత్తుపల్లి ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం



**సత్తుపల్లి, మార్చి 26(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో కటికాల వెంకటేశ్వరరావు విజయం సాధించారు. ప్రత్యర్థి జీ శివరామకృష్ణపై 45 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి సుంకర లక్ష్మణరావు ప్రకటించారు. మొత్తం 110 ఓట్లలో 92 ఓట్లు పోలయ్యాయి. కటికాల వెంకటేశ్వరరావుకు 68 ఓట్లు రాగా, జీ శివరామకృష్ణకు 23 ఓట్లు లభించాయి. ఒక ఓటు చెల్లనిదిగా ప్రకటించారు. ఈ మేరకు కటికాల వెంకటేశ్వరరావును ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు. విజయం సందర్భంగా పలువురు న్యాయవాదులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

# అత్యాచారం ఘటనను ప్రశ్నించిన వారిపైనే కేసులా?

- అరెస్టులపై నిరంజన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం





**వనపర్తి,మార్చి26(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలో బాలికపై జరిగిన అత్యాచారం ఘటనను ప్రశ్నించిన నాయకుల అరెస్టుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, అక్రమ కేసుల్లో అరెస్టయిన నాయకులను కలిసి ధైర్యం చెప్పారు.నందిమల్ల అశోక్, చీర్ల చందర్, మెకానిక్ శ్రీను తదితరులతో పాటు మరో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. బాధిత బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వెళ్లిన వారిపై కేసులు నమోదు చేయడం అన్యాయమని ఆయన అన్నారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. అసలు నిందితుడిపై చర్యలు తీసుకోవాల్సిన సమయంలో ప్రశ్నించిన వారిపైనే కేసులు నమోదు చేయడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు.అరెస్టయిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే బాధిత బాలికకు మరియు ఆమె కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి,

# తరతరాలకు ఆదర్శం శ్రీరాముడు

- యువత ఆయన జీవితాన్ని మార్గదర్శిగా తీసుకోవాలి



**వనపర్తి,మార్చి26(తెలంగాణ ముచ్చట్లు):** తరతరాలుగా భారతదేశానికి శ్రీరాముడు ఆదర్శమూర్తిగా నిలిచారని, యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పేర్కొన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆయన సందేశం విడుదల చేశారు.రామాయణంలో శ్రీరాముడి పాత్ర అత్యంత కీలకమైందని, ఆయన కేవలం ఒక పాత్ర మాత్రమే కాకుండా ఆ ఇతిహాసానికి ఆత్మవంటివారని తెలిపారు.వాల్మీకి రామాయణంలో రాముడు ధర్మానికి సజీవ రూపమని, ఎలాంటి కష్టాలొచ్చినా సత్యం, నీతి మార్గాన్ని విడిచిపెట్టని వ్యక్తిత్వం ఆయనదని అన్నారు.శ్రీరాముడు ఆదర్శ కుమారుడు, సోదరుడు, భర్త, రాజుగా నిలిచారని పేర్కొన్నారు. కైకేయి మాట మేరకు రాజ్యాన్ని త్యజించి అడవికి వెళ్లడం ఆయన పితృభక్తికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిందన్నారు.ప్రజలను తన సంతానంలా చూసుకున్న రాజు శ్రీరాముడు అని ఆయన అన్నారు.రామరాజ్యం అనేది న్యాయం, నైతికత, శాంతి నెలకొన్న సుపరిపాలనకు సంకేతమని వివరించారు. మనిషిగా జీవిస్తూ ప్రేమాభిమానాలు పంచడం, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవడం ఎలా అనేది రాముడు తన జీవితంతో చూపించాడన్నారు.తన కోదండం అనే విల్లుతో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసిన ధైర్యవంతుడని, లోకకళ్యాణం కోసం రావణాసురుని సంహరించేందుకు అవతరించాడని పేర్కొన్నారు.సంక్షిప్తంగా చెప్పాలంటే, ధర్మాన్ని నిలబెట్టిన మహనీయుడు శ్రీరామచంద్రుడు అని, యువత ఆయన జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చెత్త ప్లాంట్‌పై ఆగ్రహం.. నాలుగో రోజుకు చేరిన నిరసన దీక్ష




**హుజురాబాద్ టౌన్ మార్చ్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ సమీపంలోని సిర్సపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న చెత్త ప్లాంట్ పై ప్రజల్లో ఆగ్రహం రోజు రోజుకు ముదురుతోంది. అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష గురువారంతో నాలుగో రోజుకు చేరుకోవడం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని బహిర్గతం చేస్తోంది.

ఈ సందర్భంగా నాయకులు మండిపడుతూ, ప్రజల అభిప్రాయాలను పూర్తిగా పక్కనపెట్టి చెత్త ప్లాంట్ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. పర్యావరణ ప్రభావం, రైతుల జీవనాధారంపై పడే నష్టాన్ని పట్టించుకోకుండా తీసుకుంటున్న నిర్ణయాలు అనాలోచితమని ఆక్షేపించారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను రద్దు చేయాలని, లేనిపక్షంలో మడికొండ తరహాలో భారీ స్థాయి ఉద్యమం చేపట్టడం తప్పదని హెచ్చరించారు. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని స్పష్టం చేశారు.

ఈ దీక్షలో రైతులు, పర్యావరణవేత్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేయడం గమనార్హం. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం మౌనంగా

# డంపింగ్ యార్డ్ రద్దు డిమాండ్‌కు కాంగ్రెస్ మద్దతు



**హుజురాబాద్ టౌన్ మార్చ్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలో డంపింగ్ యార్డ్ రద్దు కోసం అఖిలపక్ష ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్షలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. గురువారం అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించిన దీక్షలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే, ప్రజా వ్యతిరేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో చేయదని స్పష్టం చేశారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనలో పాల్గొన్న ఆయన, నిరసనకారులతో కలిసి కొంతసేపు దీక్ష స్థలంలో కూర్చొని మద్దతు తెలిపారు. డంపింగ్ యార్డ్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గమనించి, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్సాహంగా నూతన కార్యవర్గం ఎన్నిక

_అధ్యక్షుడిగా కేసరి శేషయ్య

హుజురాబాద్ టౌన్ మార్చ్ 26 (తెలంగాణ ముచ్చట్లు)



స్థానిక బార్ అసోసియేషన్‌కు 2026 27 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం (మార్చి 26) ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. మొత్తం 125 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను అధికారులు జోజుల ప్రవీణ్ కుమార్, గురాల వెంకట్ కుమార్, బాగోతు కుమారస్వామి పర్యవేక్షించి ఫలితాలను ప్రకటించారు.

ఎన్నికల ఫలితాల్లో అధ్యక్షుడిగా కేసరి శేషయ్య 63 ఓట్లు సాధించి తన సమీప ప్రత్యర్థి శంకర్ కనుకుంట్లపై విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పాక జ్యోత్స్న దేవి 85 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.

ఇతర పదవుల్లో ఉపాధ్యక్షుడిగా రాజేష్ పిట్టాల (84 ఓట్లు), జాయింట్ సెక్రటరీగా యెంగాల లింగమూర్తి (47 ఓట్లు), క్రీడా & సాంస్కృతిక కార్యదర్శిగా మోరే కళ్యాణ్ (74 ఓట్లు), జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా యాస్మిన్ (66 ఓట్లు) ఎన్నికయ్యారు.

ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా ముగియడంతో నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.




## సైన్స్ ప్రాజెక్టులతో ఆకట్టుకున్న ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు

**జమ్మికుంట టౌన్ మార్చ్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శన విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించింది. ఈ ప్రదర్శనను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించి వారి సృజనాత్మకతను కొనియాడారు. చిన్న వయసులోనే శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి అద్భుతమైన నమూనాలను రూపొందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను గుర్తించి మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.పాఠశాల అభివృద్ధికి మున్సిపల్ తరపున అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొలుగూరి సురేష్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అధ్యాపకులు, కందాల రాము, గడ్డం దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీలో అత్యవసర సమావేశం

- 32 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

జమ్మికుంట టౌన్ మార్చ్ 26 (తెలంగాణ ముచ్చట్లు):




జమ్మికుంట మున్సిపాలిటీ పాలకవర్గ అత్యవసర సమావేశం గురువారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో మొత్తం 32 ముఖ్య అంశాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. వేసవి కాలంలో తలెత్తే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని బోర్ల మరమ్మతులు, కొత్త వాటర్ ట్యాంకుల ఏర్పాటు, నీటి సరఫరా మెరుగుదలపై నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే పారిశుధ్య పనులు బలోపేతం చేయడం, స్ట్రీట్ లైట్లు కొనుగోలు, పార్కుల్లో లైటింగ్ ఏర్పాటు, హమాలి కార్మికులకు టాయిలెట్ బ్లాక్ నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 202627 సంవత్సరానికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై కూడా స్పష్టత ఇచ్చారు.

ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు గ్యాంగ్ వర్క్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి వార్డులో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, ఎ.డి అహ్మద్, మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, టీపీఓ శ్రీధర్, రాజ్ కుమార్, దీపిక, సీనియర్ అసిస్టెంట్ వాణి, ఆర్ఐ భాస్కర్, ఎస్ఐ మహేష్ మరియు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.




## మీడియా సహకారం, పోరాట ఫలితం సూరజ్ కుటుంబానికి న్యాయం

**కుషాయిగూడ, మార్చ్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలో వాసవి శివ నగర్ కాలనీలోని గోపి స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన 9వ తరగతి విద్యార్థి సూరజ్ కుమార్ (14) కుటుంబానికి న్యాయం చేకూరింది.ఈ ఘోర ఘటన వెలుగులోకి రావడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం మరియు బిఆర్ఎస్ నేత గోగికార్ శివకుమార్ పోరాటం కీలకంగా నిలిచాయి. సూరజ్ కుమార్ మృతి తరువాత, మీడియా వేగంగా స్పందించి, బాధిత కుటుంబ సమస్యను సమాజానికి తెలియజేసింది.శివకుమార్ నేతృత్వంలో పాఠశాల ముందు జరిగిన భారీ ధర్నా మరియు మీడియా కవరేజ్ ఫలితంగా, పోలీసులు యాజమాన్యం పై కేసు నమోదు చేశారు. అదనంగా, నిరుపేద బీసీ కుటుంబానికి రూ 3 లక్షల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.శివకుమార్ మాట్లాడుతూ: "బలహీన వర్గాల పిల్లలకు అన్యాయం జరుగితే, మేము చూడని కోణంలో ఉండము. మీడియా సహకారం, ప్రజల ఐక్యత వల్లే సూరజ్ కుటుంబానికి న్యాయం సాధ్యమైంది. భవిష్యత్తులో కూడా బాధితులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది."




## కుషాయిగూడ పీహెచ్‌సీలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

- '99 రోజుల ప్రజా పాలన
- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహణ

**కుషాయిగూడ, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) గురువారం ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ స్త్రీ ప్రసూతి నిపుణులు డాక్టర్ శివరంజని శ్వేత, డాక్టర్ ఎస్. మానస, డాక్టర్ బి. శ్వేత, డాక్టర్ సమీన్, డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ లలిత గర్భిణీ స్త్రీలు మరియు మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు.అదేవిధంగా ఆర్థోపెడిక్ నిపుణులు ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులకు వైద్యం అందించారు. పెడియాట్రిషన్లు చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కంటి మరియు దంత వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, పళ్ల సమస్యలపై చికిత్స అందించారు.ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ శిబిరం మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. కుషాయిగూడ, జమ్మిగడ్డ మరియు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మొత్తం 384 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి తెలిపారు. స్థానికంగా నిపుణులైన వైద్యులు అందుబాటులోకి వచ్చి సేవలు అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య బృందం సూచించింది.




## ఆరు గుణాలను జయిస్తే భగవంతుని కృప

**కుషాయిగూడ, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు అనే ఆరు గుణాలను జయించిన వారే భగవంతుని కృపకు పాత్రులవుతారని శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ఉగాది, శ్రీరామనవమి పర్వదినాలను పురస్కరించుకొని దుండిగల్ ఆశ్రమంలో ఆయన భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, పరాభవ నామ సంవత్సరంలో ప్రతి వ్యక్తి తనలోని అహంకారాన్ని విడిచిపెట్టి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. కాలానికి అనుగుణంగా కర్తవ్యాలను నిర్వర్తిస్తూ చెడు ఆలోచనలను దూరంగా ఉంచుకోవాలని చెప్పారు. కాలం విలువను తెలుసుకొని సత్పథంలో నడిచే వారికి విజయాలు సొంతమవుతాయని పేర్కొన్నారు.శ్రీరామ కళ్యాణ మహోత్సవాలు నూతన ఆరంభాలకు ప్రతీకగా నిలుస్తాయని, తెలుగు నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ గత తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఇస్తుందని వివరించారు. మానవ జీవితం అమూల్యమని, దాని విలువలను గ్రహించి ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు.జీవితంలో సుఖం-దుఃఖం రెండూ సమానంగా ఉంటాయని, అవే మనిషిని అహంకారం నుంచి దూరంగా ఉంచుతాయని తెలిపారు. కేవలం సుఖం మాత్రమే ఉంటే అహంకారం పెరిగి పరాభవానికి దారి తీస్తుందని హెచ్చరించారు. అహంకారాన్ని విడిచి సద్గుణాలతో జీవించాలని భక్తులకు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ విజయానంద తీర్థ స్వామీజీ కూడా పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను పరామర్శించిన నాయకులు

**హన్మకొండ,మార్చి26(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తార్య తండలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చ నాయక్ దశదినకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, గ్రామస్తులు హాజరై లచ్చ నాయక్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. లచ్చ నాయక్ సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ఎన్ నాయక్, కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, లంబాడీల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లావుడియా పల్లవి రాజు నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యురాలు అనసూర్య జగరాం నాయక్, గబ్బర్ సింగ్, సీనియర్ జర్నలిస్ట్ భూక్య శ్రవణ్ కుమార్, బిక్షపతి, రాజేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# జవహార్ నగర్ పిల్లల అభివృద్ధికి ప్రత్యేక డ్రైవ్ అవసరం

- రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యురాలు చందన

మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):




మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా పరిధిలో జవహార్ నగర్‌లోని పిల్లల భవిష్యత్తును కాపాడటానికి జిల్లాయంత్రాంగం మొత్తం సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యురాలు చందన అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కమిషన్ సభ్యురాలు సరితతో కలిసి సమావేశంలో పాల్గొన్న చందన మాట్లాడుతూ, ఇటీవల జవహార్ నగర్ సందర్శనలో అక్కడి పరిస్థితులు ఆందోళన కలిగించాయని పేర్కొన్నారు. దాదాపు 100 కాలనీల్లో ఎక్కువగా మురికి వాడలే ఉండటం వల్ల పిల్లలకు కనీస విద్య, ఆరోగ్య సదుపాయాలు అందడం లేదని తెలిపారు.ఈ సమస్యలను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి కాలనీలో పిల్లల వివరాలు సేకరించి, పాఠశాలకు వెళ్లని మరియు చదువు మానేసిన పిల్లలను గుర్తించాలని అన్నారు.అలాగే ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పిల్లలకు ఆధార్, జనన, కుల ధృవపత్రాలు లేని పరిస్థితి ఉందని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా వాటిని అక్కడికక్కడే అందించాలని ఆదేశించారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్, డ్రాప్‌అవుట్ వంటి సమస్యలను నివారించేందుకు సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని చెప్పారు.లేబర్ శాఖ చైల్డ్ లేబర్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఆపరేషన్ ముస్కాన్ తరహాలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సూచించారు.జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక డ్రైవ్ ద్వారా అన్ని శాఖల సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రావతి, కీసర ఆర్డీఓ రాజేష్, డిఈఓ విజయకుమారి, డిడబ్ల్యూఓ శారద, పోలీసు, లేబర్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కీసర జంక్షన్‌లో అడ్వర్టైజ్‌మెంట్ పాలసీపై ఫీల్డ్ సర్వే

కీసర, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ అమలుకు సంబంధించి కీసర సర్కిల్ పరిధిలోని కీసర జంక్షన్‌లో గురువారం ఉదయం ఫీల్డ్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేను మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంతకు పలు సూచనలు చేస్తూ, పాలసీ అమలులో పారదర్శకతతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముఖ్యంగా, కీసర జంక్షన్ పరిసర ప్రాంతాల్లో నూతనంగా బస్ షెల్టర్లు, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డై ఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) సంతోష్ కుమార్, ఏఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) అనిల్ పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రాంబాబు పోరాటానికి బీఎస్పీ మద్దతు

- ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు
- జర్నలిస్ట్ యూనియన్ లు ఇళ్ల స్థలాల పోరాటానికి మద్దతుగా రావాలి
- వర్కింగ్ జర్నలిస్ట్ అందరూ ఐకమత్యంతో పోరాడి ఇళ్ల స్థలాలు సాధించుకోవాలి

ఖమ్మం బ్యూరో, మార్చి 26(తెలంగాణ ముచ్చట్లు)




అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గత పదకొండు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపట్టిన సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబుకు బహుజన్ సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్ట్ రాంబాబును గురువారం కలిసి బొడ్డు బాబురావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బొడ్డు బాబురావు.. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తన మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. అదేవిధంగా ఖమ్మంలో ప్రభుత్వం ఏర్పడక ముందే ఇళ్ల స్థలాలు, ఇండ్లు కట్టించి ఇస్తామని మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డితో పాటు మిగతా ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క లు ఇచ్చిన హామీలను కూడా ఆయన గుర్తు చేశారు. కానీ జర్నలిస్టులకు మాత్రం ఇళ్ల స్థలాల కాలయాపన జరుగుతూనే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 23.02 ఎకరాల భూమిని జర్నలిస్టులకు కేటాయించినప్పటికీ ఈ ప్రభుత్వం ఇవ్వడానికి, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి జాప్యం చేస్తుందని విమర్శించారు. జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల భూమిలో ప్రభుత్వ భూమి పేరుతో బోర్డు పెట్టి ఆ మంత్రే కబ్జా చేస్తున్నాడా అనే అనుమానాన్ని కూడా వ్యక్తం చేశారు. అలా చేయకపోతే జర్నలిస్టులకు ఎప్పుడో కేటాయించే వారని పేర్కొన్నారు.
న్యాయబద్ధంగా వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇప్పించాలని, అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల ఆలస్యం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే రేపటి భవిష్యత్తు ప్రశ్నార్థకమే అన్నారు. వాడుకొని పదే పదే హామీలిచ్చి జర్నలిస్టులను మోసం చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని విమర్శించారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా జర్నలిస్ట్ రాంబాబు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతు తెలిపి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇచ్చిన అమలు చేయాలని ఖమ్మం జిల్లా మంత్రులను కోరారు. గత పదకొండు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీనియర్ జర్నలిస్టు రాంబాబుకు జర్నలిస్టు యూనియన్లు మద్దతు తెలిపి ఆయన పోరాటంలో భాగస్వామ్యమై ఇండ్ల స్థలాలు సాధించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా రాంబాబుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి విజయం సాధించాలని బొడ్డు బాబూరావు ఆకాంక్షించారు.



# ఈనెల 30వ తేదీన అసెంబ్లీని ముట్టడిని విజయవంతం చేయండి

- తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ.

హసన్ పర్తి,మార్చ్ 26(తెలంగాణ ముచ్చట్లు):

65 డివిజన్ ఎల్లాపూర్ గ్రామంలో గల అంబేద్కర్ సెంటర్ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు అసెంబ్లీ ముట్టడికి తీర్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల హక్కులకై పోరాటం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టినటువంటి హామీలు తెలంగాణ అమరవీరుల కుటుంబాలతో పాటు ఉద్యమకారులకు ఇప్పటివరకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని కమిటీ వేస్తానని చెప్పి మూడు సంవత్సరాలు కావస్తున్నా కమిటీ వేయడం లేదు కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యమకారులు స్వచ్ఛందంగా అసెంబ్లీ ముట్టడి ఈనెల 30 వ తేదీన పిలుపునివ్వడం జరిగిందని తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యమకారులు పార్టీలకుఅతీతంగా సంఘాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ ప్రతి ఒక్క ఉద్యమకారులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచారు.ఈ కార్యక్రమంలో దేవన బొయిన కుమారస్వామి,పాడి రామకృష్ణారెడ్డి,వెల్ సోజు రాజయ్య,రాజన్న,గోలి విద్యాసాగర్ రెడ్డి,ఎండి రహీం పాషా,వెలిసోజు రమణాచారి,సతీష్,గోపనబోయిన రవీందర్,ఎర్ర శ్యాంసుందర్,తిరుపతి రెడ్డి,వెలిసోజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా

- ప్రయాణికుడి ఫిర్యాదుపై రైల్వే కఠిన చర్య
- క్యాటరింగ్ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు
- సేవల నాణ్యతపై రాజీ ఉండదని స్పష్టం

**న్యూఢిల్లీ, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):** వందే భారత్ రైల్లో ఆహార నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుపై భారత రైల్వే కఠిన చర్యలు తీసుకుంది. సొంత సంస్థ అయిన ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)కు రూ.10 లక్షల జరిమానా విధించింది. ప్రయాణికుల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుంటామని రైల్వే అధికారులు తెలిపారు. మార్చి 15న పాట్నా-టాటానగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో అందించిన ఆహారం నాణ్యతపై ఒక ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న రైల్వే అధికారులు విచారణ చేపట్టి, సంబంధిత సంస్థపై చర్యలు తీసుకున్నారు. ఐఆర్‌సీటీసీతో పాటు సేవలందించిన సర్వీస్ ప్రొవైడర్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానా విధించడంతో పాటు కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశించారు. రైళ్లలో ప్రయాణికులకు అందించే ఆహారం నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
రైళ్లలో ప్రతి సంవత్సరం సుమారు 58 కోట్ల భోజనాలను రైల్వే అందిస్తున్నట్లు వెల్లడించింది. ఆహార నాణ్యత, అధిక ధరలపై వచ్చే ఫిర్యాదులు చాలా తక్కువ శాతంలోనే ఉన్నాయని తెలిపింది. అయినప్పటికీ ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఇలాంటి ఫిర్యాదులపై విచారణ జరిపి మొత్తం రూ.2.6 కోట్ల జరిమానాలు విధించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రయాణికుల భద్రత, సేవల నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొంది. ఇదిలా ఉంటే, 2025లో పాంట్రీ కార్ సిబ్బంది ప్రయాణికులపై దాడి చేసిన మూడు ఘటనలు నమోదయ్యాయని తెలిపింది. ఆ సంఘటనలపై ప్రభుత్వ రైల్వే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు కొనసాగిస్తామని రైల్వే స్పష్టం చేసింది.

# శ్రీ సీతారామ దివ్య చరితం

జనకాత్మజా జానకీ జగదంబ రూపిణి
జ్యోతిర్మయి,
శుభలక్షణ శోభితాంగి శశిముఖి
శాంతస్వరూపిణి;
రఘువంశ తిలకుడైన రాముని
హృదయరత్నమై,
భువనమంత వెలుగొందె భక్తజన పావన
సౌభాగ్యము!

మృదుమందహాస విహారిణి మానస
సరస్సు కమలమై,
మంగళ గుణగణ గర్భిణి మాతృస్వరూపిణి
మాధుర్యమై;
అరణ్యాంతర గాఢవిపినమున
అనుబంధమై నిలిచినది,
అనురాగ దీప్తి సాక్షిగా అచంచల
సత్యసంకల్పమై!

రామో విగ్రహవాన్ ధర్మో రమణీయ
గుణసాగరో,
సీతా సహచర్యమున్ సదా సౌమ్యమూర్తి
సుపావనుడు;
సముద్రం సైతం సంభ్రమించు శౌర్య
గంభీర వైభవం,
సేతుబంధ కీర్తి సాక్షిగా సాగరమే
స్తుతించెను!

విరహాగ్ని వేడిలోనూ విశ్వాస దీప్తి
మాయంకాక,
సీతా హృదయం సత్యసింధు స్ఫటికమై
నిలిచెను;
రాముని నామస్మరణే రక్షణమై
మార్గదర్శిగా,
ధర్మదీపికగా దివ్యదాంపత్య గాథను
నిలిపెను!

అశోకవాటికలో ఆర్తిగా నిలిచిన ఆ
మంగళ రూపం,
అమృతధారల కన్నీరై ఆకాశమున్ పలికె
గాథ;
ఆ దుఃఖ గాథతను చీల్చి ఆంజనేయుని
దర్శనముతో,
ఆశల చిగురులు విరిసె ఆత్మవిశ్వాస
సాక్షిగా!

లంకాపురి లయగర్జనలో రామబాణ
జ్వాలలతో,
దశముఖ దర్ప దహనమై ధర్మజయం
ఘోషించగా;
సీతా రాముల కలయికలో సర్వలోక
మంగళ గానం,
సత్యసంధాన సౌభాగ్యమై సకలజన
హృదయముల నిండె!

శ్రీరామ సీతల నామమిదే శాశ్వత
మంత్రస్వరూపము,
చిత్తశుద్ధి చెలిమెలై చిగురించే చైతన్య
దీపము;
భక్తి పరవశ తరంగిణిలో భవసాగరము
దాటించు,
పరబ్రహ్మ సాక్షాత్కార పథమిదే పావన
సత్యము

చైత్రమాస శుక్లపక్ష నవమి పుణ్యకళ్యాణ
పర్వదినంబున,
సేవాసౌభాగ్య సుధాసింధువై నా
చిత్తమున్ పరిపూర్ణమై;
మంజుల పత్తిపాటి
మృదులకరాంబుజములందు
శ్రీ సీతారామ కల్యాణ కృత్యము
సుగంభీరమై సాగుచుండగా,
కరుణామయ! కటాక్ష కృపాప్రవాహమే
కలిగించితివి ఈ మహాభాగ్యమున్
రామయ్య!
భక్తి పరవశ హృదయంతో శరణాగతి
సమర్పించగా,
జన్మార్థక పరమసాఫల్యమై
జయనినాదములై విరిసె!

శ్రీ సీతారామ చరణారవింద సేవాసుధా
ప్రసాదమున్ స్ఫూర్తి సింధువై,
మంజుల కలమున్ కళామాత కృపతో
పద్యరత్నాల వికాసమై;
భక్తహృదయ భావసుమాల వాక్సుధా
ప్రవాహమున్ వెలిగించగా,
సీతారామ కటాక్షమే ధన్యజీవిత సత్యమై
నిలిచె!



శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ శుభాకాంక్షలు!

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,
చరవాణి 9347042218
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం.

—మంజుల పత్తిపాటి

# ఉమాంగ్ యాప్‌తో ప్రభుత్వ సేవలు

హైదరాబాద్, మార్చి 26 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉమాంగ్ యాప్ ఇప్పుడు మరింత విస్తృతంగా ఉపయోగపడుతోంది. ఒక్క యాప్ ద్వారా వేలాది సేవలను పొందే అవకాశం ఉండటంతో ప్రజలు పెద్దఎత్తున దీనిని వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే మొబైల్ సహాయంతో నిమిషాల్లోనే ప్రభుత్వ సేవలను పొందవచ్చు. మొత్తం రెండు వేల నాలుగు వందలకుపైగా సేవలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సమయం, ఖర్చు రెండింటినీ ఆదా చేసుకునే వీలుంది. ఇటీవల ఈ యాప్‌లో జరిగిన లావాదేవీలు భారీగా పెరగడం దీని వినియోగాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరాన్ని తగ్గించేందుకు ఈ యాప్‌ను ప్రారంభించారు. పలు శాఖల సేవలను ఒకేచోట అందించే విధంగా దీన్ని రూపొందించారు. గ్యాస్ బుకింగ్ నుంచి పింఛన్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు వరకు అనేక సేవలను ఈ యాప్ ద్వారా పొందవచ్చు. ప్రతి సేవ కోసం వేర్వేరు వెబ్‌సైట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ ఒకేచోట లభిస్తాయి. ఈ యాప్‌ను కొన్ని సంవత్సరాల క్రితమే ప్రారంభించినప్పటికీ, ప్రస్తుతం సేవల




సంఖ్య గణనీయంగా పెరిగింది. మొదట కొన్ని సేవలతో ప్రారంభమైన ఇది ఇప్పుడు అనేక రెట్లు విస్తరించింది. ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా సులభంగా ఉపయోగించగలుగుతున్నారు.

# యుద్ధం ముగింపు దిశగా చర్చలు




పశ్చిమాసియాలో గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న యుద్ధ మేఘాలు క్రమంగా తొలగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధాన్ని ముగించేందుకు తీవ్రస్థాయిలో దౌత్య ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఇరాన్‌కు 15 సూత్రాలతో కూడిన కాల్పుల విరమణ ఒప్పంద ప్రతిపాదనను పంపినట్లు సమాచారం. ఈ ఒప్పందం ద్వారా అణు కార్యక్రమాల నియంత్రణ, హోర్ముజ్ జలసంధి పునరుద్ధరణ వంటి అంశాలపై పట్టు సాధించాలని అమెరికా భావిస్తోంది. ఇరాన్ కూడా కొన్ని షరతులతో కూడిన ప్రతిపాదనలను తిరిగి పంపినట్లు వార్తలు వస్తుండటంతో, త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న ఆశలు ప్రపంచ దేశాల్లో చిగురిస్తున్నాయి. మరోవైపు యుద్ధం ముగింపు దశకు చేరుకుందన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్కు సుమారు 2 శాతం మేర తగ్గి 103 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు ఇది సానుకూల అంశమే అయినప్పటికీ, రవాణా మార్గాల్లో ఇంకా అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకల రాకపోకలు ఇంకా పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడలేదు. ఇరాన్ కేవలం తమకు మిత్ర దేశాలుగా ఉన్న భారత్, రష్యా, చైనా వంటి దేశాల నౌకలకు మాత్రమే అనుమతినిస్తుండటం గమనార్హం.

శాంతి చర్చల వార్తలు వస్తున్నప్పటికీ, ఇన్వెస్టర్లలో నెలకొన్న భయాందోళనలు బంగారం ధరలను ఆకాశానికి చేర్చుతున్నాయి. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ చేసిన కొన్ని హెచ్చరికలు, ఇజ్రాయెల్ ఇంకా దాడులు కొనసాగిస్తుండటంతో సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు అందరూ మొగ్గు చూపుతున్నారు. దీని ప్రభావం హైదరాబాద్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. గడిచిన 24 గంటల్లో నగరంలో తులం బంగారం ధరపై సుమారు రూ. 376 పెరిగింది. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రికార్డు స్థాయిలో రూ. 1,46,680 మార్కును తాకింది. సాధారణ కొనుగోలుదారులు ఈ పెరిగిన ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. యుద్ధ క్షేత్రంలో పరిస్థితులు గమనిస్తే, ఇజ్రాయెల్ వైమానిక దళం టెహ్రాన్ సమీపంలోని కీలక క్షిపణి తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించింది. దీనికి ప్రతిగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కూడా ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ లక్ష్యంగా డ్రోన్లను ప్రయోగించాయి. ఇరు పక్షాలు తామే విజయం సాధించామని ప్రకటించుకుంటున్నాయి. ట్రంప్ తన ప్రకటనలో "మనం ఈ యుద్ధంలో గెలిచాం, ఇరాన్ నాయకత్వ మార్పు దిశగా వెళ్తోంది" అని పేర్కొన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా పోరాటం కొనసాగుతూనే ఉంది. అగ్రరాజ్యాల మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం ప్రపంచవ్యాప్తంగా రాజకీయ మరియు ఆర్థిక పరిణామాలను వేగంగా మారుస్తోంది.

భారత్ ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే వివిధ దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. రష్యా, పాకిస్థాన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం. ఒకవేళ వచ్చే 48 గంటల్లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో సాధారణ స్థితి నెలకొంటుందని నిపుణులు భావిస్తున్నారు. లేనిపక్షంలో చమురు ధరలు మళ్ళీ పెరిగి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం యావత్ ప్రపంచం అమెరికా-ఇరాన్ మధ్య జరగబోయే తదుపరి దౌత్య చర్చల వైపు ఆసక్తిగా చూస్తోంది.

# యువత పాత్ర.. నవభారత నిర్మాణానికి దిక్సూచి



ఏ దేశాభివృద్ధికైనా ఆ దేశ యువతే వెన్నెముక వంటి వారు. భారతదేశం వంటి అత్యధిక యువజన జనాభా కలిగిన దేశంలో, ఈ శక్తిని సరైన దిశలో మళ్ళించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. యువత కేవలం దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వారు దేశ వర్తమానానికి కూడా ఊపిరి వంటి వారు. వారిలో ఉండే ఉత్సాహం, నూతన ఆలోచనలు మరియు సాహసించే గుణం దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాయి. నేటి గ్లోబల్ విలేజ్ యుగంలో, ప్రపంచంతో పోటీ పడాలంటే యువత తమ మేధస్సును, నైపుణ్యాన్ని దేశ ప్రయోజనాల కోసం వెచ్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ నుండి సామాజిక మార్పుల వరకు ప్రతి అంశంలో యువత సంతకం స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్థికాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమైనది. నేడు భారతదేశం స్టార్టప్ రంగంలో ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలవడానికి ప్రధాన కారణం యువ పారిశ్రామికవేత్తలే. కొత్త వ్యాపార ఆలోచనలతో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ జీడీపీ వృద్ధికి వారు తోడ్పడుతున్నారు. కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే స్థాయికి యువత ఎదగడం ఒక శుభపరిణామం. వ్యవసాయం నుండి అంతరిక్ష పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ యువత తమదైన ముద్ర వేస్తున్నారు. డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకొని, మారుమూల గ్రామాలకు కూడా సేవలను చేరువ చేయడంలో యువ సాంకేతిక నిపుణుల కృషి అనిర్వచనీయం. ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడమే నవభారత లక్ష్యం కావాలి.

'మేక్ ఇన్ ఇండియా' వంటి పథకాలను విజయవంతం చేయడంలో యువ ఇంజనీర్లు, శాస్త్రవేత్తల పాత్ర మరువలేనిది. గ్రామీణ సమస్యలకు తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాలను కనుగొనడం ద్వారా వారు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. సాంకేతికతను కేవలం వినోదం కోసం కాకుండా, విజ్ఞానం మరియు వికాసం కోసం వాడుకున్నప్పుడే జాతి గర్విస్తుంది. సామాజిక మార్పులకు యువత ఒక శక్తివంతమైన సాధనం. సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలు, కులమత వైషమ్యాలు మరియు లింగ వివక్షకు వ్యతిరేకంగా యువత గొంతు ఎత్తాలి. సామాజిక స్పృహ కలిగిన యువత ఉన్నప్పుడే చట్టాలు సక్రమంగా అమలవుతాయి.

రాజకీయాల్లో యువత ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉంది. దేశ విధాన రూపకల్పనలో యువత ఆలోచనలకు చోటు దక్కినప్పుడే అవి వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. కేవలం ఓటర్లుగానే కాకుండా, చట్టసభల్లోకి యువ రక్తం ప్రవేశించడం ద్వారా పాలనలో పారదర్శకత, వేగం పెరుగుతాయి. అవినీతి రహిత రాజకీయాల కోసం యువత పోరాడాలి. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మరియు రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంలో వారు ముందుండాలి. యువ నాయకత్వం వల్ల దేశానికి కొత్త ఉత్సాహం, సరికొత్త విజన్ లభిస్తుంది. రాజకీయాలను ఒక సేవగా భావించే తరం వచ్చినప్పుడే దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం మొదటి అడుగు కావాలి. విద్య మరియు నైపుణ్యాభివృద్ధి యువతకు శక్తినిచ్చే ఆయుధాలు. నేటి పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే నిరంతరం నేర్చుకునే తత్వం ఉండాలి. కేవలం డిగ్రీలు సంపాదించడం కాకుండా, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ప్రభుత్వం కల్పిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను సద్వినియోగం చేసుకోవాలి. విదేశాల్లో విద్యనభ్యసించినా, తమ మేధస్సును మాతృభూమి సేవకు అంకితం చేసే ధోరణి పెరగాలి. జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న తరుణంలో, యువత తమను తాము ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. ఉన్నత చదువులు చదివి ఉన్నత ఆశయాల కోసం జీవించడమే నిజమైన దేశభక్తి. అప్పుడే మనం 'విశ్వగురువు'గా అవతరించగలం. నిరంతర అభ్యాసమే విజయానికి సోపానం.పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించడంలో యువ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలి. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మనల్ని మనం కాపాడుకోవడమే అనే సత్యాన్ని యువత గ్రహించాలిరక్షించడం అనేది ఒక ఫ్యాషన్ కాదు, అది ఒక పవిత్ర కర్తవ్యం. భారతదేశం ఒక యువ దేశం. ఈ 'డెమోగ్రాఫిక్ డివిడెండ్'ను మనం సరిగ్గా వాడుకుంటే, 2047 నాటికి భారత్ వికసిత దేశంగా మారడం ఖాయం. యువత తమలోని శక్తిని గుర్తించి, లక్ష్యం వైపు పయనించాలి. స్వామి వివేకానంద చెప్పినట్లు "లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి" అనే సూక్తి యువతకు స్ఫూర్తి కావాలి. దేశాభివృద్ధి అంటే కేవలం అంకెలు పెరగడం కాదు, ప్రతి పౌరుడి జీవితంలో వెలుగు నిండటం. ఆ వెలుగును నింపే బాధ్యత యువత భుజాలపై ఉంది. మీ ప్రతి ఆలోచన, ప్రతి అడుగు దేశాభివృద్ధికి ఇంధనం కావాలి. మనం బాగుంటేనే దేశం బాగుంటుంది. యువత మేల్కొంటేనే నవ భారతం సాధ్యమవుతుంది.

# విద్యా సంస్కరణలు: భవనాలు vs నాణ్యత

## బడ్జెట్ నిధులు, వసతుల కల్పన, బోధనా ప్రమాణాలు

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ సమూల మార్పులకు లోనవుతున్న తరుణంలో, ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ మరియు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల మధ్య సమతుల్యతపై విస్తృత చర్చ జరుగుతోంది. ముఖ్యంగా విద్యా రంగానికి వేల కోట్ల రూపాయలు కేటాయించడం శుభపరిణామం అయినప్పటికీ, ఆ నిధులు కేవలం భవనాల నిర్మాణానికే పరిమితం అవుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు ధీటుగా కనిపిస్తున్న మాట వాస్తవమే కానీ, ఆ గోడల మధ్య జరిగే బోధనలో నాణ్యత ఎంతవరకు ఉందనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. విద్యా సంస్కరణలు అంటే కేవలం రంగులద్దిన గోడలు, ఆధునిక బెంచీలు మాత్రమే కాదు, విద్యార్థి మేధస్సును పదునుపెట్టే ఉత్తమ విద్యా విధానం కూడా అందులో భాగం కావాలి. రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్' ద్వారా ప్రభుత్వం ఒక కొత్త ఒరవడిని సృష్టించాలని చూస్తోంది. అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన ఈ పాఠశాలలు పేద విద్యార్థులకు వరంలా మారతాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ భారీ భవనాల నిర్వహణ మరియు భవిష్యత్తులో వీటిని కొనసాగించే విధంపై స్పష్టమైన ప్రణాళిక అవసరం. గతంలో కూడా అనేక భవనాలు నిర్మించినా, సరైన నిర్వహణ లేక అవి శిథిలావస్థకు చేరుకున్న దాఖలాలు ఉన్నాయి. కాబట్టి, కొత్తగా నిర్మించే ప్రతి ఇటుక వెనుక నాణ్యమైన విద్యను అందించాలనే బలమైన సంకల్పం ఉంటేనే ఈ వేల కోట్ల రూపాయల పెట్టుబడికి సార్థకత లభిస్తుంది.




ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన అనేది ప్రాథమిక అవసరం. తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస వసతులు లేని పాఠశాలల్లో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడం అసాధ్యం. ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయడం మంచిదే అయినా, డిజిటల్ తరగతి గదులు మరియు కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటులో మరింత వేగం పెంచాల్సి ఉంది. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం లేని విద్య అసంపూర్ణం కాబట్టి, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఇంటర్నెట్ మరియు కంప్యూటర్ సౌకర్యం అందుబాటులోకి రావాలి. వసతుల కల్పన అనేది నిరంతర ప్రక్రియగా సాగాలి తప్ప కేవలం ఎన్నికల హామీలకో, బడ్జెట్ ప్రసంగాలకో పరిమితం కాకూడదు. బోధనా నాణ్యత విషయంలో ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అత్యాధునిక భవనాలు ఉన్నప్పటికీ, అక్కడ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోతే ఆ భవనాలు నిరుపయోగం. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలి. కేవలం నియామకాలు మాత్రమే సరిపోవు, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక అంశాలను విద్యార్థులకు బోధించాలంటే, ముందుగా ఉపాధ్యాయులు వాటిపై పట్టు సాధించాలి. విద్యా నాణ్యత అనేది కేవలం సిలబస్ పూర్తి చేయడంలో లేదు, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో ఉంది.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక సాహసోపేతమైన నిర్ణయం. కౌమార దశలో ఉన్న విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం వల్ల వారు చదువులో రాణించే అవకాశం ఉంటుంది. కానీ, ఈ పథకం అమలులో క్షేత్రస్థాయిలో అనేక లోపాలు కనిపిస్తున్నాయి. నిధుల విడుదల ఆలస్యం కావడం వల్ల నిర్వాహకులు నాణ్యత లేని భోజనాన్ని వడ్డిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ఇటువంటి అంశాల్లో ప్రభుత్వం ఏమాత్రం అలసత్వం వహించకూడదు. భోజన నాణ్యతను తనిఖీ చేయడానికి ప్రతి కళాశాలలో ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను కొంతవరకు అధిగమించవచ్చు. విద్యా వ్యవస్థలో నాణ్యత పెరగాలంటే పాఠ్యాంశాల రూపకల్పనలో కూడా మార్పులు రావాలి. ప్రస్తుతం ఉన్న సిలబస్ కేవలం మార్కుల వేటకే ప్రాధాన్యత ఇస్తోంది తప్ప, విద్యార్థికి కావలసిన జీవన నైపుణ్యాలను నేర్పించడం లేదు. ప్రాథమిక స్థాయి నుండి వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా చదువు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆంగ్ల భాషా నైపుణ్యాలతో పాటు మాతృభాషపై మమకారం పెంచేలా విద్యా విధానం ఉండాలి. విద్య అనేది కేవలం పుస్తకాలకు పరిమితం కాకుండా, సమాజాన్ని అర్థం చేసుకునేలా ఉండాలి. అప్పుడే విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు మరియు సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం ప్రైవేట్ పాఠశాలలపై ప్రజల్లో ఉన్న మితిమీరిన నమ్మకం. ఈ ధోరణిని మార్చాలంటే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉన్నత అధికారులు మరియు ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినప్పుడే సామాన్యులకు కూడా ఆ నమ్మకం కలుగుతుంది. విద్యా రంగంలో సంస్కరణలు అనేవి కేవలం కాగితాల మీద కాకుండా, సామాన్య విద్యార్థికి అందే ఫలాల ద్వారా కొలవబడాలి. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి ఏడాది ఒక 'క్వాలిటీ ఆడిట్' నిర్వహించడం ద్వారా ఎక్కడ లోపాలు ఉన్నాయో గుర్తించి వాటిని సరిదిద్దే అవకాశం ఉంటుంది.

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంలో ప్రభుత్వం ఇంకా కృషి చేయాల్సి ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న వసతులు పల్లెల్లోని పాఠశాలలకు అందడం లేదు. డిజిటల్ విప్లవం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినప్పుడే నిజమైన సమానత్వం సిద్ధిస్తుంది. ప్రతి పల్లెటూరి విద్యార్థికి ప్రపంచ స్థాయి విజ్ఞానం అందేలా ఇంటర్నెట్ కనెక్టివిటీని బలోపేతం చేయాలి. అలాగే, రవాణా సౌకర్యాలు లేక చదువుకు దూరమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాలను కల్పించాలి. విద్య అనేది ఎవరికీ భారం కాకూడదు, అది అందరికీ అందుబాటులో ఉండే ఒక సహజ హక్కుగా మారాలి. దీనికోసం బడ్జెట్ కేటాయింపులు మరింత పారదర్శకంగా జరగాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల విజయానికి సమాజ భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యం. పాఠశాల నిర్వహణ కమిటీలు క్రియాశీలకంగా పనిచేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు గురించి ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో సంప్రదించాలి. కేవలం ప్రభుత్వమే అన్నీ చేయాలని కోరుకోకుండా, పూర్వ విద్యార్థులు మరియు దాతలు కూడా పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఒక గ్రామంలోని పాఠశాల ఆ గ్రామానికి ఒక దేవాలయం వంటిదని భావించినప్పుడు మాత్రమే దాని అభివృద్ధి సాధ్యమవుతుంది. విద్యా రంగంలో వస్తున్న మార్పులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా కూడా తన వంతు పాత్ర పోషించాలి. అప్పుడే సంస్కరణల లక్ష్యం నెరవేరుతుంది. ముగింపుగా, విద్యా రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం, కానీ ప్రయాణం ఇంకా సుదీర్ఘంగా ఉంది. భవనాల నిర్మాణం ఒక మైలురాయి అయితే, విద్యా నాణ్యత పెంపుదల అనేది గమ్యం. ఈ గమ్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలి. అప్పుడే రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఒక విజ్ఞాన ఖనిగా మారి, దేశాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించగలడు. బడ్జెట్ నిధులు సద్వినియోగం అయినప్పుడే, ప్రభుత్వ ఆశయాలు నెరవేరుతాయి మరియు తెలంగాణ రాష్ట్రం విద్యా పటంలో అగ్రగామిగా నిలుస్తుంది. విద్య అనేది రేపటి తరానికి మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి అనే విషయాన్ని ఎవరూ మరువకూడదు.


తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# రవితేజ 'వెంకీ'కి 22 ఏళ్లు.. శ్రీనువైట్ల ఎమోషనల్ పోస్ట్




మాస్ మాహారాజ రవితేజ కెరీర్‌లో ఆల్‌టైమ్ క్లాసిక్ హిట్‌గా నిలిచిన వెంకీ సినిమా విడుదలై నేటికి 22 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనువైట్ల సోషల్ మీడియా వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకున్నారు. 'వెంకీ' సినిమా కేవలం ఒక చిత్రం మాత్రమే కాదని, తనకు ఎంతో ఆత్మీయమైన మధుర ప్రయాణమని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఎదురైన కష్టాలను గుర్తుచేసుకుంటూ, మొత్తం 70 రోజుల షూటింగ్‌లో దాదాపు 40 రాత్రులు వరుసగా షూటింగ్ చేశామని వెల్లడించారు. తెరపై సహజమైన నైట్ ఎఫెక్ట్ కోసం ఇలా కష్టపడ్డామని తెలిపారు. ఈ ప్రయాణంలో హీరో రవితేజ అందించిన మద్దతు, అంకితభావం మరువలేనిదని కొనియాడారు. అలాగే నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాలో స్నేహ హీరోయిన్‌గా నటించగా, బ్రహ్మానందం, ఎం.ఎస్. నారాయణ కామెడీ ట్రాక్స్ ప్రేక్షకులను ఇప్పటికీ నవ్విస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా రైలు ప్రయాణంలో వచ్చే కామెడీ సన్నివేశాలు నేటికీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. సినిమా విడుదల సమయంలోనే కాకుండా, ఇటీవల రీరిలీజ్ సమయంలో కూడా ప్రేక్షకులు చూపించిన అపారమైన ప్రేమ తమకు ఎంతో ఆనందం కలిగించిందని శ్రీనువైట్ల తెలిపారు. ఇప్పటికీ ఎక్కడికెళ్లినా 'వెంకీ' గురించి మాట్లాడుతుండటం గర్వంగా ఉందని, ఈ ఆదరణను ఎప్పటికీ మరిచిపోలేమని ఆయన అన్నారు.

# శ్రీరామనవమి కానుకగా 'వాల్మీకి రామాయణం' ఫస్ట్ లుక్ విడుదల




భారతీయ మహాకావ్యం రామాయణంను వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు రూపొందుతున్న వాల్మీకి రామాయణం చిత్రం నుంచి ఫస్ట్ లుక్ విడుదలైంది. శ్రీ రామనవమి సందర్భంగా విడుదలైన ఈ పోస్టర్ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. జాతీయ అవార్డు గ్రహీత దర్శకురాలు భావనా తల్వార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భక్తి, భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా రూపొందించిన ఫస్ట్ లుక్‌లో శ్రీరాముడి పాదాలను ప్రతిబింబించడం విశేషం. "పర్వతాలు ఉన్నంతకాలం, నదులు ప్రవహించినంతకాలం రామాయణం జీవిస్తుంది" అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో పోస్టర్ విడుదల చేశారు. చాలా సంవత్సరాల విరామం తర్వాత భావనా తల్వార్ మళ్లీ మెగాఫోన్ పట్టడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ అందిస్తుండగా, బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సౌండ్ డిజైన్‌ను రసూల్ పూకుట్టి అందిస్తున్నారు.
కథను ఆనంద్ నీలకంఠన్, చంద్రప్రకాష్ ద్వివేది కలిసి అందిస్తున్నారు. ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# బాలయ్యకు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' పురస్కారం.. భారత్ మండపంలో ఘన సత్కారం

టాలీవుడ్ అగ్ర నటుడు నందమూరి బాలకృష్ణకు ప్రతిష్టాత్మక 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' పురస్కారం లభించింది. దేశ రాజధానిలో ఘనంగా ప్రారంభమైన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ దిల్లీ 2026లో ఆయనకు ఈ గౌరవం దక్కింది.
సుదీర్ఘకాలంగా సినీ పరిశ్రమకు అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ నిర్వాహకులు బాలకృష్ణను ఈ అవార్డుతో సత్కరించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో అట్టహాసంగా జరిగిన వేడుకలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా బాలయ్య ఈ పురస్కారం అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో బాలకృష్ణతో పాటు ప్రముఖ నటి షర్మిలా ఠాగూర్, దివంగత లెజెండరీ నటుడు ధర్మేంద్ర తరపున వారి కుటుంబ సభ్యులు కూడా ఇదే గౌరవాన్ని అందుకున్నారు. ఈ వేడుకను ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో పాటు హేమమాలిని, కంగనా రనౌత్, షర్మిలా ఠాగూర్ మరియు కేంద్ర మంత్రులు కపిల్ మిశ్రా, పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ విదేశాల నుంచి పలువురు సినీ ప్రముఖులు హాజరైన ఈ వేడుకలో బాలకృష్ణకు ఈ అవార్డు దక్కడం పట్ల తెలుగు సినీ పరిశ్రమ ఆనందం వ్యక్తం చేస్తోంది. దశాబ్దాలుగా తనదైన నటనతో అభిమానులను అలరిస్తున్న ఆయనకు జాతీయ స్థాయిలో దక్కిన ఈ గౌరవం ఆయన సినీ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది.



# సీనియర్ హీరోలకు జంటగా పెళ్లైన హీరోయిన్స్.. అనీల్ రావిపూడి ప్లానింగ్స్ అదుర్స్

టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్ అంటే గుర్తుకు వచ్చే దర్శకుడు అనీల్ రావిపూడి మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల మన శంకర వర ప్రసాద్ గారు సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ఆయన, ఈసారి మల్టీస్టారర్ కథను ప్లాన్ చేస్తున్నాడు.
ఈ చిత్రంలో వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటించనుండటం విశేషం. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్ల ఎంపిక కూడా ఆసక్తికరంగా మారింది. వెంకటేష్ సరసన కీర్తి సురేష్ నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. 'మహానటి'తో గుర్తింపు పొందిన కీర్తి, పెళ్లి తర్వాత కూడా వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా కొనసాగుతోంది.
ఇక కళ్యాణ్ రామ్ సరసన కృతి శెట్టిను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. 'ఉప్పెన'తో క్రేజ్ సంపాదించిన కృతి, ఈ ప్రాజెక్ట్‌తో మళ్లీ ఫామ్‌లోకి రావాలని చూస్తోంది.
అనీల్ రావిపూడి స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సినిమాలో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మేళవించనున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్‌కు ఫ్యామిలీ కామెడీ ట్రాక్, కళ్యాణ్ రామ్‌కు యాక్షన్ ఎలిమెంట్స్‌ను ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.
త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి సీజన్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అధికారిక ప్రకటనలు రాకముందే ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ నెలకొనడం గమనార్హం.



# శ్రీలీల రూట్లో ట్రావెల్ చేస్తున్న మమిత

ప్రస్తుతం సినీ పరిశ్రమలో హీరోయిన్లు తమ కెరీర్‌ను స్మార్ట్‌గా ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో శ్రీలీల, మమితా బైజు కెరీర్ ఎంపికలు ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి.
కేవలం కమర్షియల్ గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ శ్రీలీల మంచి గుర్తింపు సంపాదించారు.
ముఖ్యంగా భగవంత్ కేసరి సినిమాలో నందమూరి బాలకృష్ణతో కలిసి ఆమె చేసిన పాత్రకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఆ పాత్ర ఆమె కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. అలాగే ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలోనూ శ్రీలీల పాత్రకు మంచి స్పందన లభించింది. దీంతో ఆమెకు స్టార్ హీరోయిన్‌గా మరింత క్రేజ్ పెరిగింది. ఇప్పుడు ఇదే స్ట్రాటజీని మమితా బైజు కూడా ఫాలో అవుతున్నట్లు కనిపిస్తోంది. బబ్లీ గర్ల్ ఇమేజ్‌తో గుర్తింపు తెచ్చుకున్న మమితా, కేవలం లైట్ హార్ట్ పాత్రలకే కాకుండా, బలమైన పాత్రల వైపు అడుగులు వేస్తున్నారు.
ప్రస్తుతం ఆమె జనగణమన సినిమాలో నటిస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో, శ్రీలీల భగవంత్ కేసరిలో చేసినట్టే ఒక ప్రాధాన్యమైన పాత్రలో మమితా కనిపించనున్నారనే టాక్ వినిపిస్తోంది.
మొత్తానికి, గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ శ్రీలీల చూపిన మార్గంలో మమితా బైజు ప్రయాణం ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఇది ఆమె కెరీర్‌కు పెద్ద మలుపు తీసుకురావచ్చని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in